క్లుప్తంగా

శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించొద్దు

జగిత్యాలరూరల్: శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ నివసించొద్దని జగిత్యాల రూరల్ తహసీల్దార్ రాంమోహన్ అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి, సంగంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. సోమన్‌పల్లిలో వర్షాలకు కూలిపోయిన ఇళ్లలో నివసిస్తున్న వారిని వెంటనే ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా శిథిలావస్థమైన ఇళ్లలో ఎవరూ నివసించవద్దని, భారీ వర్షాల దృష్ట్యా ప్రజలెవరూ కూడా చెరువులు, కుంటలు, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. ఏదైనా వరదలు వస్తే వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలిరావాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: గోదావరి ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నందునా ఎర్దండి గోదావరి చివరిలో ఉన్న ఇళ్ల ప్రజలు పునరావాస కేంద్రాలకు ఖాళీ చేసి రావాలని తహసీల్దార్ ప్రసాద్ సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలిపారు. గోదావరి ఉగ్రరూపం దాల్చితే నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని, పై అధికారుల ఆదేశాల మేరకు గోదావరి చివరి వైపున ఉన్న 60 కుటుంబాలను పాఠశాలలకు, సంఘ భవనాలకు లేదా బంధువులు ఎవరైన ఉంటే ఖాళీ చేసి, వెంటనే వెళ్లాలని కోరారు. రాత్రి వరకు ఖాళీ చేయించి పునారవాస కేంద్రాలకు తరలించనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, ఆర్‌ఐ గంగాధర్, కార్యదర్శి మనోజ్, కారొబార్ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడ్డ ఇల్లు పరిశీలన

మండలంలోని వేములకుర్తిలో ఆదివారం సాయంత్రం ఎడపెల్లి శ్రీనివాస్ పెంకుటిళ్లపై పిడుగు పడింది. సోమవారం తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో చంద్రశేఖర్‌లు ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయమందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని పెర్కపల్లి, మోతె, అనంతారం, పొలాస, చల్‌గల్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. వరదల దృష్ట్యా ప్రజలెవరూ ఆరుబయటకు రావద్దన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

నాయకపు గూడెంలో ఎస్సై పర్యటన

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్‌లో సోమవారం ఎస్సై అశోక్ సుమారు 2 కి.మీ వరకు కాలిబాటన వెళ్లి నాయకపు గూడెం ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి ప్రజలతో మాట్లాడి సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. వర్షాలు ఉధృతంగా కురుస్తున్న నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రజలను అప్రమత్తం చేశారు.

పట్టుదలతో పనిచేస్తే గుర్తింపు

జగిత్యాలక్రైం: పట్టుదలతో పనిచేస్తే పోలీసు శాఖలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావును కమాండేషన్ లెటర్ అందించి అభినందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీ జిల్లా పర్యటన సందర్భంగా భద్రత పరంగా నిర్వహించిన విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భీంరావుకు డీజీపీ కమాండేషన్ లెటర్‌ను ప్రకటించారు. దీంతో అడిషనల్ ఎస్పీకి కమాండేషన్ లెటర్ అందించి అభినందించారు.

నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

జగిత్యాలక్రైం:నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. మండపాల్లో నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా కార్యక్రమాలు చేపట్టవద్దన్నారు. పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మథరావు, సుధీర్ రావు పాల్గొన్నారు.

పొలాల అమావాస్య వేడుకలు

ధర్మపురి: శ్రావణ మాసం సోమవారం పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధర్మపురితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పొలాల అమావాస్య సందర్భంగా రైతులు తమ పశువులకు స్నానం చేయించి రంగు రంగులతో, పూలతో అలంకరించారు. అనంతరం ఇంటిలో వండిన నైవేద్యాలను వాటికి ఆహారంగా పెట్టి పండుగ వేడుకలను నిర్వహించారు.


కోరుట్లలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మల్లాపూర్‌లో..


సారంగాపూర్‌లో..


మల్యాలలో..


రాయికల్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


పెగడపల్లిలో..


మేడిపల్లి మండల కేంద్రంలో..

వైఎస్సార్‌కు ఘన నివాళి

కోరుట్ల/ధర్మపురి/రాయికల్/మల్లాపూర్/సారంగాపూర్/పెగడపల్లి/మేడిపల్లి/మల్యాల/కథలాపూర్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆయనకు నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, మండల కేంద్రాలు,వివిధ గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు, నిరుపేదలకు ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమపథకాలను కొనియాడారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తులు పాల్గొన్నారు.



ధర్మపురి, కథలాపూర్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు

పొంగుతున్న మత్తళ్లు.. నిలిచిన రాకపోకలు

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు వర్షపు నీటితో మత్తళ్లు దూకుతున్నాయి. మండలంలోని ఇటిక్యాల, మూటపల్లి, సింగరావుపేట లోలెవల్ కల్వర్టులపై వర్షపునీరు ప్రవహించడంతో ఎక్కడికక్కడే వాహన రాకపోకలు నిలిచిపోయాయి. బోర్నపల్లిలో గోదావరిమట్టం వర్షపు నీటితో పెరిగింది.

పెగడపల్లి:మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్థంభించిపోయింది. ఆగని చినుకు..సాగని పనులు అన్నట్లుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఏడుమోటలపల్లి నుంచి తాండాకు వెళ్లే తారురోడ్డు కోతకు గురైంది. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల చెరువులు, కుంటలు నిండుకుని మత్తళ్లు దుముకుతున్నాయి. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్ సోమవారం లింగాపూర్ పెద్ద చెరువును సందర్శించి చెరువు కట్టను పరిశీలించారు.


ఇటిక్యాలలో కల్వర్టుపై నిలిచిన రాకపోకలు


పెగడపల్లి: ఏడుమోటలపల్లిలో కోతకు గురైన రోడ్డు

నిండుగా ఆత్మకూర్ పెద్దవాగు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్దవాగు నిండుగా ప్రవహిస్తోంది.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిజామాబాద్ జిల్లా కోనాపూర్ రాళ్లవాగులో వరదనీరు భారీగా చేరుతోంది.అక్కడ మత్తడి దూకడంతో ఆత్మకూర్ పెద్దవాగులోకి వరదనీరు సోమవారం ప్రమాదకర స్థాయిలో చేరుతోంది. అలాగే జగ్గాసాగర్ శివారులో మాన్సూర్‌వాగు వద్ద వరదకాల్వ గేట్లను తెరవడంతో కొండ్రికర్ల,పెద్దాపూర్ వాగుల్లో నీటి ఉధృతి ఎక్కువగా ఉంది.

ప్రజలు,అధికారులు అప్రమత్తంగా ఉండాలి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


రాయికల్‌లో మత్తడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: నియోజకవర్గంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని మత్తడిని సోమవారం పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో గత రెండు రోజులుగా వర్షాలు తీవ్రంగా కురిశాయని, దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని, ప్రజలెవరూ అత్యవసరమైతేనే బయటకు రావాలని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకుస్తే సహాయం చేయడానికి సైతం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తాను నియోజకవర్గ కేంద్రంలో అందుబాటులో ఉంటానని, ఒక్క ఫోన్‌కాల్ చేసినా సమస్య పరిష్కరిస్తానన్నారు. రెవెన్యూ, పోలీసు అధికార యంత్రాంగాలు అన్ని రకాల చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, పడిగెల రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు మహేందర్‌బాబు, నాయకులు చంద్రతేజ, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు



వెల్గటూర్, కమ్మునూర్‌లో పునరావాస కేంద్రాల్లో ప్రజలు, అధికారులు

వెల్గటూర్ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వెల్గటూర్ మండలంలో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఎండపల్లి మండలం చెర్లపల్లిలోని జెల్ల లింగయ్య ఇల్లు కూలిపోయింది. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరికి వరద పోటెత్తింది. పాశిగామ గ్రామంలోని గోదావరి తీర ప్రాంతంలో నివాసం ఉంటున్న 18 కుటుంబాల ప్రజలను అధికారులు వెల్గటూర్ లోని హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉదయ్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారంగాపూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టుల నుంచి దిగువకు భారీగా నీటిని వదలడంతో గోదావరి తీరం వెంబడి ఉన్న బీర్‌పూర్ మండల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ, సోమవారం అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. గోదావరి తీరంను ఆనుకుని ఉన్న రంసాగర్, చిన్నకొల్వాయి గ్రామాల ప్రజలను కండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల కొల్వాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి ఆహారం ఇతర ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లచ్చాలు, ఎస్సై కుమారస్వామి, డీటీ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన


పైడిమడుగులో ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్డీవో

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగులో ముంపు ప్రాంతాలను కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్ సోమవారం పరిశీలించారు. పెద్ద వాగు పరిసరాలతో పాటు, డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసముండే ప్రజలను రాత్రి వేళ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగు వైపు ప్రజలు ఎవరూ వెళ్ల వద్దని సూచించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ కిషన్, ఆర్‌ఐ వై. రాజేందర రావు, తదితరులు ఉన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

సారంగాపూర్: భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సారంగాపూర్ తహసీల్దార్ రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని రేచపల్లితో పాటు పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలను ఆయన పరిశీలించారు. రేచపల్లి ఊరచెరువు నిండి దిగువకు మత్తడి పోస్తున్న నేపథ్యంలో చెరువులోకి చేపలకోసం మత్స్యకారులు వెళ్లవద్దని, రైతులు కూడ చెరువుల వద్ద పొలాల్లోకి వెళ్లేసమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలాంటి ప్రమాదం పొంచిఉన్న వెంటనే కాల్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐలు భాస్కర్‌రావు, కృష్ణ , రైతులు, మత్స్యకారులు ఉన్నారు.


చెరువుల ఆక్రమణతోనే కాలనీలు జలమయం

కోరుట్ల: పట్టణంలోని చెరువుల ఆక్రమణతోనే పట్టణంలోని పలు కాలనీలు జలమయ్యాయని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ ఆరోపించారు. ఈ మేరకు కోరుట్ల డెవలప్‌మెంట్ ఫోరం నాయకులతో కలిసి సోమవారం పలు ముంపు ప్రాంతాలను పరిశీలించి, అనంతరం తహసీల్దార్ కిషన్‌కు వినతి పత్రం సమర్పించారు. పట్టణంలోని వాగు, చెరువులు, కుంటల ప్రాంతాల్లో బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు చెన్నా విశ్వనాథం, నాయకులు చింతా భూమేశ్వర్, రాజేందర్, షాహేద్, ఎలిశెట్టి గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో అధికారుల పర్యటన

మెట్‌పల్లి: పట్టణంలో పెద్ద చెరువు నీటితో ముంపు పొంచి ఉన్న సుల్తాన్‌పురా, విద్యానగర్ కాలనీల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ మోహన్ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా చెరువు నీరు దిగువకు వెళ్లే కాల్వ పరిసరాల్లో నివాసముంటున్న ప్రజలకు పలు సూచనలు చేశారు. కాల్వ పొంగితే ఇండ్లలోకి వరద నీరు వచ్చే అవకాశముంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎల్లమ్మ చెరువుకు జల కళ..



కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామ శివారులోని ఎలమ్మ చెరువు జల కళ సంతరించుకుది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దుంకుతుంది.

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు లబ్ధి

మెట్‌పల్లి: సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు లబ్ధి కలుగుతోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. మండలానికి చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల లింగారెడ్డి, జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి తదితరులున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: ఎస్‌కేఎన్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అశోక్ తెలిపారు. ఆంగ్లం-3, తెలుగు-3, హిస్టరీ-1, కామర్స్-2, మ్యాథమెటిక్స్-1, ఫిజిక్స్-1 ఖాళీలున్నాయని, పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీలు 50శాతం) పొంది ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగినవారికి వెయిటేజీ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల ఐదో తేదీ వరకు కళాశాలలో సంప్రదించాలని కోరారు. 6న ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు. వివరాల కోసం 81215 13671 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. ముత్యం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో తెలుగు, హిస్టరీ, కెమిస్ట్రీ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు.ఎస్సీ,ఎస్టీలకు 50 శాతం మార్కులుండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులు, టీచింగ్ అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందన్నారు. వివరాలకు వైస్ ప్రిన్సిపాల్ నడికట్ల సాందీప్ సెల్ నంబర్ 9885588419 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వరద ప్రాంతాల్లో పరిశీలన



జగిత్యాలరూరల్: భారీ వర్షాలకు వస్తున్న వరదను జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సోమవారం పరిశీలించారు. జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి, రూరల్‌మండలం అనంతారం వంతెనపై ప్రవహిస్తున్న వరద ఉధృతి, పట్టణంలోని మోతె, గొల్లపల్లిరోడ్, గోవిందుపల్లి బ్రిడ్జిలను పరిశీలించారు. ఆమె వెంట మాజీ జెడ్పీటీసీ మహేశ్,గంగాధర్, గంగారెడ్డి, ముత్తయ్య ఉన్నారు.

రైతులకు నష్టం కలగనీయొద్దు

సారంగాపూర్: భారీ వర్షాలతో రైతులకు నష్టం జరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని దావ వసంత అన్నారు. మండలంలోని పోచంపేట, లచ్చక్కపేటలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈని కోరారు.

సంక్షిప్త వార్తలు

• శ్రీరామలింగేశ్వర ఆలయంలో డీఆర్డీవో పూజలు

మల్లాపూర్ : మండలంలోని వాల్గొండ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం డీఆర్డీవో, ఇంచార్జీ డీపీవో రఘువరన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఆర్డీవోతో స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట ఎంపీడీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

•చెన్నకేశవనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచముఖ లింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

• జ్వరాల అదుపునకు సహకరించాలి

సారంగాపూర్: గ్రామాల్లో జ్వరాల అదుపునకు సహకరించాలని జిల్లా మాతా శిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి, పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల్లో నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగుల ఇంటికి వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి శివకుమారి, వైద్యసిబ్బంది ఉన్నారు.

• రుణమాఫీ కోసం అధికారుల సర్వే

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో రైతుల కుటుంబ నిర్ధారణకు వ్యవసాయశాఖ అధికారులు సోమవారం సర్వే చేశారు. రూ. 2 లక్షలు పంటరుణం తీసుకుని రేషన్‌కార్డులు లేకుండా సుమారు 67 మంది రైతులు గ్రామంలో ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. వారి వివరాలు సేకరించి రైతుల నుంచి అఫిడవిట్‌లు తీసుకున్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శేఖర్, ఏఈవో హరీశ్, రైతులు పాల్గొన్నారు.

•దెబ్బతిన్న లింక్‌రోడ్లకు వెంటనే మరమ్మతు

మల్లాపూర్: భారీ వర్షాలకు దెబ్బతిన్న లింక్‌రోడ్లను మరమ్మతు చేయిస్తామని పంచాయతీరాజ్ డీఈ బండ రమణరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంలో వర్షాలకు దెబ్బతిన్న లింక్ రోడ్లను కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంచాయతీరాజ్ శాఖకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. రూ.15లక్షలతో తాత్కాలిక మరమత్తు చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

మల్యాల: రుణమాఫీ కాని రైతులు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ అన్నారు. మండలంలోని నూకపల్లిలో సోమవారం రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రేషన్ కార్డులేని రామన్నపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నూకపల్లి ప్యాక్స్‌కు సంబంధించిన రైతుల కుటుంబ నిర్ధారణ కోసం దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యవసాయాధికారి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో కె.చంద్రదీపక్ ఏఈఓలు కారుణ్యకుమార్, ఈ.శ్రీనివాస్, ఎ.మంజుల, ప్యాక్స్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

• వెల్గటూర్ ఎంపీడీవోగా విజయలక్ష్మి

వెల్గటూర్ : మండల ఎంపీడీవోగా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన రవీందర్‌రెడ్డి పదవీ విరమణ చేయగా, జగిత్యాల అర్బన్ మండలంలో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి వెల్గటూర్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు

•పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా కుమారస్వామి

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా సంగ కుమారస్వామి ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా కౌశెట్టి నవీన్, మండల అసోసియేట్ అధ్యక్షుడిగా పుప్పాల నరేశ్, మండల కార్యదర్శిగ సంగెం శ్రీనివాస్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా భోగ నాగరాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంగ శ్రీధర్ వ్యవహరించారు.

• రాయికల్ ఆస్పత్రికి సిబ్బంది నియామకం

రాయికల్: పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రికి ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్‌ఎం, వాచ్‌మెన్‌లను నియమించినట్లు సోమవారం సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డి తెలిపారు.

• యువసేన యూత్ అధ్యక్షుడిగా శశాంక్

రాయికల్: పట్టణంలోని యువసేన యూత్ అధ్యక్షుడిగా మోర శశాంక్, ఉపాధ్యక్షులుగా మోర కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా ముల్క నిఖిల్, కోశాధికారిగా మోర హర్షిత్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.